కల్యాణ వైభోగమే

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో గురువారం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వివిధ ఆలయాల్లో వేదపండితులు కల్యాణం శాస్త్రోక్తంగా చేశారు.అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మానకొండూర్ మండలం కొండపల్కలలో చిన్నారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాల్లో రాములోరి కల్యాణానికి ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రసమయి బాలకిషన్ హాజరయ్యారు. జమ్మికుంట పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలోని రామాలయంలో ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు దంపతులు శ్రీసీతారాములకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. రామనామస్మరణతో రైల్వే స్టేషన్ ప్రాంగణం మారు మోగింది. మండలంలోని వావిలాల ఖాదీ ప్రతిష్టాన్ రామాలయంలో ఖాదీ ప్రతిష్టాన్ చైర్మన్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి కల్యాణానికి హాజరయ్యారు. అబాది జమ్మికుంట శ్రీలక్ష్మీచెన్నకేశస్వామి, మారుతినగర్ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లో కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్ శ్రీలత, ఆలయ అధ్యక్షుడు, కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొనగంటి శారద పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలం రేణికుంటలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. చిగురుమామిడి మండలం సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణంలో దంపతులు పాల్గొన్నారు. కమనీయంగా నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ చైర్మన్లు, వివిధ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మానకొండూర్‌లో కళాకారులతో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, తదితరులు


చొప్పదండి పట్టణంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


వీణవంక: పోతిరెడ్డిపల్లిలో కల్యాణం అనంతరం ఊరేగింపు


శంకరపట్నం: కేశవపట్నంలో..


చిగురుమామిడి: సుందరగిరిలో సీతారాముల కల్యాణం


మానకొండూర్: గంగిపల్లి గ్రామంలో సీతారాముల కల్యాణం


రామడుగు: వెలిచాల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో


జమ్మికుంట: పట్టువస్త్రాలు, తలంబ్రాలతో మున్సిపల్ చైర్మన్ దంపతులు


సైదాపూర్: ఎగ్లాస్‌పూర్‌లో సీతారాముల కల్యాణోత్సవం

ఆలయాల నిర్మాణానికి విరాళం

గంగాధర: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న దేవాలయాల నిర్మాణాలకు మల్లాపూర్ గ్రామానికి చెందిన తూడి లచ్చయ్య విరాళం అందజేశారు. మధురానగర్‌లో కంకాలమ్మ కేతేశ్వర దేవాలయానికి రూ. 10,116, వెంకంపల్లిలో పోచమ్మ గుడి నిర్మాణానికి రూ.20,016, వెంకంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పోతుగంటిపల్లిలో హనుమాన్ ఆలయం నిర్మాణానికి రూ.10,116 విరాళం అందజేశారు.


విరాళం అందజేస్తున్న లచ్చయ్య

హనుమాన్ ఆలయానికి మైక్‌సెట్

రామడుగు: మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయానికి గ్రామానికి చెందిన దాత పూరెల్ల భాస్కర్ మైక్‌సెట్‌ను బహూకరించారు. గురువారం ఆలయ పూజారి మనవలా రామస్వామికి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సముద్రాల శ్రీనివాస్, అనుపురం వెంకటేష్, బొడ్ల శ్రీధర్, రామోజు కిషన్, దేవాలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మైక్‌సెట్ బహూకరిస్తున్న దాత భాస్కర్

వేణుగోపాలస్వామి ఆలయ పునఃనిర్మాణ దాతలకు సన్మానం


దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం వేణుగోపాలస్వామి ఆలయం పునఃనిర్మాణానికి దాతలు ముందుకువచ్చారు. గ్రామానికి చెందిన తనుకు తిరుపతయ్య సోదరులు రూ.రెండ లక్షలు, పాలడుగుల బాబన్న రూ.1.50 లక్షలు, గాజుల వెంకటేశ్వర్ సోదరులు, వరంగల్‌కు చెందిన శ్రీరాం ప్రభాకర్ రూ.లక్ష చొప్పున, గొల్లపల్లి వెంకటేశ్, ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రావి రవీందర్ రూ.51వేల చొప్పున, భూపతి నాగభూషణం రూ.50వేల విరాళం ప్రకటించారు. రావుల ప్రభాకర్ విగ్రహాలు, సముద్రాల సంపత్ ధ్వజస్తంభం అందించేందుకు ముందుకు వచ్చారని ఆలయ చైర్మన్ గాజుల శ్రీనివాస్ తెలిపారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు, చైర్మన్‌ను సన్మానించారు.

ఆముదాలపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

శంకరపట్నం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ భిక్షతోనే ఎమ్మెల్యే అయ్యానని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో గురువారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు. సీతారాముల కల్యాణం రోజు రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఎక్కడా జరగలేదని.. ఆముదాలపల్లిలో జరగడం ప్రత్యేకత అని పేర్కొన్నారు. 146 గ్రామాల్లో అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు చేశానన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేశానని, ఐక్యతగా ఉండాలని కోరిన మహానీయుడు అంబేడ్కర్.. జన్మనిచ్చింది తల్లిదండ్రులైతే ..రాజకీయ జన్మనిచ్చింది అంబేడ్కర్ అని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మానస, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ జంపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళకు ఆదరణ

వీణవంక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి ప్రజల నుంచి ఆదరణ వస్తోందని జెడ్పీటీసీ మాడ వనమాల సాదవరెడ్డి అన్నారు. మండలంలోని ఎల్బాక గ్రామంలో మాట్లాడారు. మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటుందని, చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం మహిళలు ఆరోగ్య పరీక్షలు చేసుకుంటున్నారని, సీఎం కేసీఆర్‌కు మహిళలు రుణపడి ఉంటారని తెలిపారు. మందులు ఉచితంగా ఇవ్వడంతో పాటు అవసరమైతే జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో ఆడబిడ్డలకు మేనమామగా నిలిచిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు ఆరోగ్య మహిళ కార్యక్రమం చేపట్టడంతో మహిళలు హర్షిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం, అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

గంగాధర: మండలంలోని గర్శకుర్తి, కాసారం గ్రామాలలో గురువారం కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం, సామాజిక అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఏడు రోజులు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపికృష్ణ పేర్కొన్నారు. గర్శకుర్తి గ్రామంలో సీతారాముల కల్యాణోత్సవంలో వలంటీర్లు సేవలు అందించారు. కార్యక్రమంలో సతీశ్‌కుమార్, ఎస్ రాజు, రవిచందర్, నిఖిల్,సంతోష్, ఆదిత్య పాల్గొన్నారు.

కార్యకర్తలే బలం, బలగం

చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: కార్యకర్తలే పార్టీకి బలం, బలగమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని ఆచంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఆరె శ్రీను రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రూ.రెండు లక్షల ప్రమాదబీమా చెక్కును ఎమ్మెల్యే గురువారం శ్రీను ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీ కార్యకర్తలకు అండగా ఉండటానికి సభ్యత్వం తీసుకున్న వారికి రెండు లక్షల బీమా సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.

పరామర్శ...

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండలశాఖ అధ్యక్షుడు శనిగరం అర్జున్‌ను గురువారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల కాలికి శస్త్రచికిత్స జరగడంతో ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీడీసీ నాగుల రాజశేఖర్‌గౌడ్, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, నాయకులు దొడ్డ లచ్చిరెడ్డి, అనిల్‌రావు, భూమయ్య, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అర్జున్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

చొప్పదండి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని తల్లిదండ్రులు, గురువుల ఆశయాలను నెరవేర్చాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. పట్టణంలోని వైశ్య భవన్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గుర్రం రాజేందర్‌రెడ్డి, పిల్లలమర్రి రవళిని సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, వీణాధరి పాఠశాల కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్, గుర్రం ఇంద్రసేనారెడ్డి, సిరిపురం నాగభూషణం, ఎలిగేటి సుధాకర్, నలుమాచు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఇందుర్తిలో వాలీబాల్ పోటీలు


ఇందుర్తిలో జట్టుకు వాలీబాల్ అందజేస్తున్న రఘునాథరెడ్డి

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామంలో డివిజన్‌స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నామని నిర్వాహకుడు గాదె రఘునాథరెడ్డి తెలిపారు. గురువారం చిగురుమామిడిలో మాట్లాడారు. పోటీల్లో పాల్గొనే జట్లకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లకు టీషర్టులు, వాలీబాల్ ఇస్తామన్నారు. ఫైనల్ పోటీలో గెలుపొందిన జట్టుకు రూ.10వేలు, రన్నర్‌కు రూ.4,500 బహుమతితో పాటు మెమొంటో అందిస్తామని పేర్కొన్నారు. వెంట శ్రావణ్, ప్రదీప్, పవన్, అరుణ్, గణేశ్, మనోజ్, హరీష్ తదితరులున్నారు.



కరపత్రాల ఆవిష్కరణ

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆవరణలో గురువారం భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కరపత్రాలను ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించే జయంతికి బహుజన నాయకులు, ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జయంతి కమిటీ చైర్మన్ సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి సుధాకర్, జ్యోతిరావుపూలే జయంతి కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు వేల్పుల రత్నం, శీలం వేణు, ఎర్ర రవీందర్, బొరగాల రాజయ్య, తదతరులు పాల్గొన్నారు.

● గీతకార్మికుడికి గాయాలు

రామడుగు: ఈతచెట్టు పైనుంచి పడటంతో గోపాల్‌రావుపేటకు చెందిన గీత కార్మికుడు ముంజ రాజయ్య (59)కు గాయాలయ్యాయి. గురువారం కల్లు గీసేందుకు చెట్టు ఎక్కేక్రమంలో కిందపడ్డాడని, చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించామని గ్రామస్తులు తెలిపారు.

అభివృద్ధిలో ఆదర్శం

- ధాన్యం కొనుగోళ్లతో ఆర్థికంగా ఎదుగుతున్న సహకార సంఘాలు
- రైతులకు అండగా నిలుస్తున్న వైనం
- వ్యవసాయాధారిత వ్యాపారాలపై దృష్టి


వెన్నంపల్లి సహకార సంఘం భవనం


నూతనంగా నిర్మిస్తున్న వెన్కెపల్లి సహకార సంఘం రైతు శిక్షణ కేంద్రం

సైదాపూర్: మండలంలో వెన్నంపల్లి, వెన్కెపల్లి వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని వెన్నంపల్లి, లస్మన్నపల్లి, ఆరెపల్లి, సోమారం, ఎగ్లాస్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వెన్కెపల్లి–సైదాపూర్ సహకార సంఘం పరిధిలో 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఐకేపీ 4 కేంద్రాలు నిర్వహిస్తుండగా, 17 గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు నిర్వహిస్తున్నారు. యాసంగిలో వెన్కెపల్లి 1.20 లక్షలు, వెన్నంపల్లి 50 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయా సంఘాల చైర్మన్లు తెలిపారు.రెండు సంఘాల ద్వారా ప్రతి సీజన్‌లో సుమారు రెండు నుంచి 2.50 లక్షల క్వింటాళ్ల వరకు ధాన్యం సేకరణ లక్ష్యంగా కొనుగోలు చేస్తామని సంఘాల చైర్మన్లు బిల్లా వెంకటరెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి పేర్కొంటున్నారు. ధాన్యం కొనుగోళ్లతో సంఘాలు రైతులకు అండగా నిలుస్తూ మరోవైపు ఆర్థికంగా ఎదుగుతున్నాయి. పాలకుల అవినీతి, రైతుల రుణాల ఎగవేతతో నిండా మునిగిన సంఘాలను గాడిలో పెట్టేందుకు ధాన్యం కొనుగోళ్లతో ప్రభుత్వం ఆర్థిక వనరులు కల్పించింది. ధాన్యం కొనుగోళ్లు, ఎరువులు, విత్తనాల విక్రయాలు, ఇతర వ్యాపారాలతో సంఘాలు లాభాల్లో కొనసాగుతున్నాయి. వెన్కెపల్లి సహకార సంఘం 14,86,257 క్వింటాళ్ల ధాన్యం సేకరించి కమీషన్ రూపంలో రూ. 4.70 కోట్లు, వెన్నంపల్లి సహకార సంఘం 4,92,000 క్వింటాళ్ల ధాన్యం సేకరించి కమీషన్ రూపంలో రూ.1.20 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నాయి. రెండేళ్లలో వరద కాలువల ద్వారా మండలంలోని చెరువుల్లో సాగు నీరు సమృద్ధిగా ఉండడంతో వరి ధాన్యం దిగుబడి పెరిగింది. ఒక ఫసల్‌కు మూడు లక్షల క్వింటాళ్ల వరకు ధాన్యం సేకరణ జరుగుతోందని చైర్మన్లు పేర్కొన్నారు.


● సొంత ఆస్తులు, వసతుల నిర్మాణానికి కసరత్తు

సంఘంలోని సభ్యులకు రూ.9 కోట్లు స్వల్పకాలిక, రూ.40 లక్షల వరకు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చి ఎప్పటికప్పుడు వసూలు చేస్తూ సంఘాలను లాభాల బాటలో నడుపుతున్నారు. వచ్చే ఆదాయంతో వ్యాపారాల అభివృద్ధికి సౌకర్యాలు కల్పించుకుంటూ పలు నిర్మాణాలు చేపట్టారు. రూ.1.44 కోట్లతో వెన్కెపల్లి సహకార సంఘం నూతన భవనం నిర్మాణం, రూ.72.90 లక్షలతో రైతు శిక్షణ కేంద్రం, బొమ్మకల్‌లో పెట్రోల్‌బంక్, గొడిశాలలో గోదాం నిర్మాణానికి స్థల సేకరణ చేశారు. వెన్నంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలోని పెట్రోల్‌బంక్ లాభాల్లో కొనసాగుతోంది. గోదాం నిర్మాణం చేశారు. సంఘం నూతన కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు చేపట్టారు. ఎగ్లాస్‌పూర్‌లో గోదాం నిర్మాణ పనులు చేపట్టారు. రైతుల సౌకర్యం కోసం బ్యాంకు సేవలు అందించేందుకు కృషి చేస్తామని చైర్మన్లు తెలిపారు.

● మిల్లర్ల దోపిడీపై రైతుల ఆందోళన

యాసంగి ధాన్యం సేకరణలో మిల్లర్ల దోపిడీ అరికట్టాలని, సమస్యలను జిల్లా అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు.


మిల్లర్ల దోపిడీని అరికడతాం



రైతులు నాణ్యమైన ధాన్యం తూకం వేయిస్తే మిల్లర్ల దోపిడీని అరికడతాం. తూకం వేసిన తర్వాత రైతు మిల్లర్ దగ్గరకు పోవాల్సిన అవసరం లేకుండా చూస్తాం. గతంలో కొన్ని మిల్లులు భారీ కట్టింగ్‌తో రైతులకు నష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతాం.

– బిల్లా వెంకటరెడ్డి,
వెన్నంపల్లి పీఏసీఎస్ చైర్మన్

కొనుగోళ్లతో సంఘాలు అభివృద్ధి



ధాన్యం కొనుగోళ్లతో సంఘాలు ఆర్థికంగా పుంజుకున్నాయి. ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ, రుణాలు సహకార సంఘాల ద్వారా అందిస్తున్నాం. వచ్చే ఆదాయంతో సంఘం నూతన కార్యాలయ భవనం, రైతుశిక్షణ కేంద్రం నిర్మిస్తున్నాం. బొమ్మకల్‌లో పెట్రోల్ బంక్, గొడిశాలలో గోదాం, సీడ్ ప్రాసెసింగ్ భవనాలు నిర్మించడానికి స్థల సేకరణ చేస్తున్నాం.

– కొత్త తిరుపతిరెడ్డి,
వెన్కెపల్లి ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com